# ఊహల పల్లకి

— వాణీ ప్రసాద్

''ఓసి, పిడుగా! నువ్వు కూర్చున్నావేమిటే? ఆవేళ నీకూ వస్తుంది లేవే!'' అంటూ- పల్లకీలో కూర్చుని చక్రాల్లాంటి కళ్ళతో పల్లకీ అందచందాలను గమనిస్తున్న శమంత నందుకొని పల్లకీ లోంచి దించింది మామ్మ.

'తోడు పెండ్లి కూతురు'లా అలంకరించుకుని, ఆకుపచ్చ రంగుకు ఎర్రంచున్న పట్టు పరికిణీ కట్టుకుని, జడకు వేడుకతో వేసుకున్న చిన్న జడకుచ్చులను మురిపెంగ చూసుకుంటు, కుందనపు బొమ్మలా ఉన్న చిన్నారి శమంతను ముద్దుగా దగ్గరికి తీసుకుంది శమంత తల్లి.

పూసల జాలరులతో, చమ్కీ దారాలతో అందంగ అలంకరింపబడిన పల్లకీలో కూర్చున్న అక్క-బావలను సంతోషంగా చూస్తూ, తల్లితోపాటే హుషారుగా పల్లకీ వెంబడి నడిచింది శమంత.

పల్లెటూళ్ళలో ఇప్పటికీ కొన్నిచోట్ల వధూవరులను పల్లకీలో ఊరేగించటం ఆచారంగా, వేడుకగా వస్తున్నది. అలాంటి పల్లెటూళ్ళలో ఒకటైన శమంత వాళ్ళ ఊరు కూడ ఇటువంటి వేడుకను ఆచారంగా అనుసరిస్తున్నదే. కోలాటంతో, చిరుతలతో గుండ్రంగా తిరుగుతూ, పాటలతో చేసే విన్యాసాలు చూస్తూ, వింటూ సంబరపడిపోయింది శమంత.

శమంత తండ్రి ఊరికి పెద్దకామందు కాబట్టి వాళ్ళ ఇంటి ముందు ప్రతి ఊరేగింపు ఆగుతూనే ఉంటుంది. అది ఆ ఊరి ఆనవాయితీ. అలా ఇంటి ముందు ఆగే ప్రతి పెండ్లి పల్లకీ అందచందాలను చూసి మురిసిపోయే శమంత అక్క పెండ్లిలో దాన్ని ఎక్కి కూర్చుని, ఎలా ఉంటుందో చూడాలనుకొని ఆపనే చేసింది.

చిన్నతనంలో అదోవేడుకగా సరదాపడినా, పన్నెండు సంవత్సరాల ప్రాయం వచ్చేటప్పటికి శమంతలో సందేహాలు మొదలయ్యాయి. అసలెందుకలా పెండ్లికొడుకును, పెండ్లికూతురును ఊరంతా పల్లకీలో త్రిప్పాలి?- ఆ ప్రశ్ననే తల్లి నడిగింది శమంత ఓరోజు.

తన మెడలో చేతులు వేసి వ్రేళ్ళాడుతూ కుతూహలాన్ని కళ్ళల్లో నింపుకుని ప్రశ్నిస్తున్న కూతురుతో ''ఊరేగింపు కాదమ్మా! ఊరెరిగింపు. అంటే వీళ్ళు దంపతులయ్యారు అని అందరికి తెలియపరచటం కోసమన్నమాట. అది వేడుక కాబట్టి పల్లకీని చక్కగా అలంకరిస్తారు. పెండ్లికి రానివాళ్ళు, రాలేనివాళ్ళు కూడ ఊరెరిగింపులో నూతన దంపతులను చూడగలుగుతారు. ఇటువంటి వేడుక ద్వారా వాళ్ళిద్దరి మధ్య కొంత సాన్నిహిత్యం కలుగుతుంది.'' అంది శమంత తల్లి శమంత తల నిమురుతూ.

తల్లి చెప్పింది కొంత అర్థమైంది. మరికొంత అంత బాగా అర్థం కాలేదు శమంతకు. తనకు కూడ పెండ్లయితే ఆ పెండ్లికొడుకుతో నేను కూడ ఊరేగుతాను. అనుకోంగానే ఏదో తెలియని అలజడి కలిగింది శమంత చిన్నగుండెలో.

ముందుకు నడుస్తున్న కాలం శమంత అంద చందాలకు ఒంపు సొంపులను కూర్చి తమ బాధ్యతను గుర్తు చేసింది తల్లిదండ్రులకు. శమంతతోపాటు శమంత మనసులో ముద్ర వేసుకున్న పల్లకీ ప్రయాణం కూడ అందంగ అలంకరించుకోసాగింది. తను, తనకు కాబోయే వరుడు అందరి పెండ్లిళ్ళలోలాగా మనుషులు మోసే పల్లకీలోకాక రెక్కల పల్లకీలో- ఆకాశవీధిలో విహారయాత్ర చేస్తున్నట్లుగా కలలుకనేది.

తమ చిన్నారి శమంతను అయినింటి కోడలుగా చేయ సంకల్పించిన తండ్రి ఆలోచనకు తగిన సంబంధం, శమంతకు తగిన సంబంధం ఆయన దృష్టిలోకి వచ్చింది. ఆడపిల్ల తండ్రిగా ఆరాటపడిన శమంత తండ్రి ఆ సంబంధంవారిని చూపులకు ఆహ్వానించాడు.

పట్నవాసి, ఉద్యోగస్థుడు, అందగాడని చెప్పదగిన చంద్రంతో శమంత వివాహం వైభవంగా జరిగింది. పెద్దకామందరింటి సంబరం ఊరంతటికి సంబరమే అయింది. 'గౌరీ పూజ' నుండి ప్రారంభమైన పెండ్లి తంతు శమంత మదిని పులకరింపచేసింది. జీలకర్ర-బెల్లం ఒకరి తలమీద మరొకరు పెట్టుకోవడం, మంగళసూత్రధారణ, తలంబ్రాలను పోటీపడి పోసుకోవటం, బిందెలోని ఉంగరాలను తీయటం ఇవన్నీ బంధుజన హాస పరిహాసాల మధ్య సందడిగా జరిగిపోయాయి.

జరగబోయే ఊరేగింపు గురించిన మధురోహలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న శమంతకు, చిన్నతమ్ముడు హేమంత్ వచ్చి ''అక్కా! నువ్వు, బావగారు ఊరేగబోయే కారు ఎంత బావుందనుకున్నావు? పూలదండలు కట్టారు. చమ్కీ దారాలు వ్రేలాడకట్టారు. ఎర్రవి, పచ్చవి, బులుగువి రంగురంగుల బూరలు కట్టారు. భలే బాగుందక్కా!'' అంటున్న హేమంత్ మాటలు శమంతలోని ఉత్సాహపు పొంగు మీద నీళ్ళు చిలకరించినట్లయింది.

పల్లకీ స్థానంలో కారును ఊహించుకోవటానికే ఆమె మనసు ఇష్టపడలేదు. తానెంతగా ఆ పల్లకీ ఊరేగింపును కోరుకుంది. అక్క పెండ్లినాటి నుండి పెరిగిన కోరిక విరిగిపోతుందా? ఊహల్లో బంగారు ఉయ్యాల లూగించిన పల్లకీ ఊహల్లోనే నిలిచిపోతుందా? శమంతను ఆలోచనల సందిట్లో వదిలేసి ఎప్పుడో తుర్రుమన్నాడు హేమంత్.

మెల్లగా తల్లి దగ్గరికి చేరింది శమంత. ఎలా ప్రారంభించాలో కూడ అర్థంకాలేదు శమంతకు. అయినా గుండె చిక్కబట్టుకుని, ''అమ్మా పెండ్లి ఊరేగింపుకు పల్లకీనే కావాలే'' అంది. అలా చెప్పటానికి కూడ సిగ్గుపడిపోతూ తలదించుకుంది.

కూతురి అభిప్రాయం అర్థమైన శమంత తల్లి వెంటనే భర్తను పిలిచి శమంత కోరికను చెప్పింది.

''నీ ముఖం, చిన్నపిల్ల. అదేదో అన్నదని నీవు తాళం వేస్తున్నావా? నా శమంత పెండ్లి పెద్దపిల్ల పెండ్లిలా కాదే. అది నా బంగారు తల్లి. అది పుట్టిన నాటి నుండే కలిసి వచ్చిందన్న సంగతి నీవు మర్చిపోయావేమో కాని, నేను మర్చిపోలేదు. శమంత పెండ్లి సీతమ్మ పెండ్లిలా జరిగిందని ఊరి జనం అనుకోవాలే. పల్లకీ ఊరేగింపు పాతకాలం నాటిది. అల్లుడు పట్నవాసి. ఉద్యోగస్థుడు. గొప్పింటి బిడ్డే. ఒక్కసారి బయటికి వెళ్ళి ఆకారు చూడవే. నీకూ ఊరేగాలనిపిస్తుంది.'' చివరలో రవ్వంత చమత్కారాన్ని కలిపాడు శమంత తండ్రి తన ఆనందాన్ని- ఆర్భాటాన్ని వెల్లడిస్తూ.

తండ్రి అంటున్నదంతా వింటున్న శమంత హృదయంలో ఏమూలో ఉన్న ఆశ కూడ అణగారి పోయింది. తన బిడ్డ పెళ్ళి వైభవంగా జరగాలనే ఆశతో ఊరేగింపుకు ఎంతో ఖర్చుచేసి కారును సిద్ధం చేసిన

తండ్రి కోరికను, ఉత్సాహాన్ని కాదని తన కోరికను స్పష్టం చేయడం శమంతకు సమంజసంగా తోచలేదు. కాని... తనలో పెరిగి కొమ్మలు, రెమ్మలు వేసుకున్న కోరిక ఇప్పుడుకాదులే, ఇంకోసారి అని వాయిదా వేసుకో తగింది కాదు. శమంతలో బాధావీచికలు కదలి కళ్ళల్లో పలుచని నీటి పొరను ఏర్పరచింది.

తన దగ్గరికి ఏదో సర్దిచెబ్దామని వచ్చిన తల్లితో ''మీ ఇష్టం అమ్మా!'' అని తన బాధ తెలియకుండ ముఖం ప్రక్కకు తిప్పుకుంది. పిచ్చిపిల్ల- నాతల్లి సిగ్గుల మొగ్గ అనుకుని తల్లి మిగతా పనుల్లో జొరబడిపోయింది.

చక్కగా, ఆడంబరంగా అలంకరించిన కారులో భర్తతోపాటు కూర్చుని దాన్నే పల్లకిగా భావించుకుని సంతృప్తిపడటానికి ప్రయత్నించింది శమంత. కాని... ఎన్నో సంవత్సరాలుగా ఊహల పల్లకీలో విహరించిన ఆమె మనసు మాత్రం వాస్తవంతో రాజీపడలేక పోయింది.

దానికి తోడు యూనిఫామ్ ధరించిన బ్యాండు మేళం వాళ్ళు యుద్ధానికి బయలుదేరుతున్న సైనికుల్లా కనిపించారు. సాంప్రదాయకమైన సన్నాయి వాయిద్యానికి బదులుగా వినిపిస్తున్న సినిమా పాటలు ఆమె మనసును ప్రశాంతంగా ఉంచటంలేదు.

పల్లకీలో ఊరేగాలనే శమంత కోరిక తీరనేలేదు. వైవాహిక జీవితం శమంతను తల్లిని చేసింది. కొడుకుకు పెండ్లి ఈడును కూడ తెచ్చింది. కొడుకు పెండ్లి అనగానే శమంతలో అణగారిన కోరికకు క్రొత్త చిగురు వచ్చింది. తన పెండ్లిలో తీర్చుకోలేని కోరికను- కొడుకు, కోడలిని పల్లకీ ఊరేగింపులో చూసి ముచ్చట తీర్చుకోవాలనుకుంది.

''మీ మామగారు మీ ఊరేగింపు గురించి ఏమంటున్నార్రా!'' అని అడిగింది కొడుకును.

''ఊరేగింపా?'' క్రొత్తగా ఆ పదం వింటున్నట్లుగా ముఖంపెట్టి ''అదేం లేదమ్మా! ఈ విషయం గురించి మాకెవరికీ ఆలోచనే లేదు. పావనికి కూడ ఇష్టం ఉండదమ్మా ఇటువంటి ఆచారాలంటే. అయినా, ఈకాలంలో పల్లెటూరి బైతుల్లాగ ఊరేగింపేమిటి? రేపు హాస్పటల్‌లో మా కోడాక్టర్స్ అందరూ ఆటపట్టిస్తారు'' అంటూ కొట్టిపారేశాడు.

కొడుకు చెప్పిన సమాధానంలో 'పల్లెటూరి బైతు' అన్న పదం సూటిగా బాణంలా గుచ్చుకుంది శమంతకు. హృదయాన్ని చిక్కబట్టుకుని, అవమానం గుండెను కోస్తుంటే జరగవలసిన కార్యక్రమంలో మునిగిపోయి మనసును మళ్ళించుకుంది.

ఆతర్వాత- నిదానంగా తరాల అంతరాన్ని, అభిప్రాయాల్లో మార్పును గమనించి మనసుకు నచ్చజెప్పుకుంది.

కూతురు పెండ్లిలో కూతురిని, అల్లుడినయినా పల్లకీలో ఊరేగుతుంటే చూడాలని ఆశపడింది. కాని కట్నకానుకలు కోరని అభ్యుదయ భావాలుకల అల్లుడు, పెండ్లి కూడ రిజిస్ట్రార్ ఆఫీసులో నిరాడంబరంగా చేసుకుంటే మంచి అల్లుడు దొరికినందుకు సంతోషపడినప్పటికి, మళ్ళీ తన కోరిక విషయంలో తనను తానే ఓదార్చుకుంది శమంత.

శమంతమ్మగా మారిన శమంత. మానవ జీవితంలో బాల్య, కౌమార, యౌవన దశలు ఎంతవేగంగా జరిగిపోతాయో వృద్ధాప్యం అంత నిదానంగా గడిచినట్లు అనిపిస్తుంది.


వృద్ధాప్యం, దాన్ని ఆశ్రయించుకుని క్షణం, క్షణం దగ్గరయ్యే మృత్యువు- శమంత జీవితమూ దీనికేమాత్రం భిన్నం కాదు.

జీవిత చరమదశలో మృత్యువు కౌగిలిలోకి చేరుకోబోయే శమంతకు కళ్ళు తెరిపిళ్ళు పడటంలేదు. చల్లబడిపోతున్న ఆమె శరీరానికి వెచ్చదనం తీసుకురావాలని పాదాలను పసుపుతో మర్దిస్తున్న కోడలి స్పర్శ- తనను రక్షించుకోవాలనే తపనతో ఒక డాక్టరుగా, కొడుకుగా కొడుకు పడుతున్న శ్రమ-

తన తలవైపు కూర్చుని పాపిట్లో సిందూరాన్ని స్పృశిస్తూ సవరించే భర్త ఆత్మీయతాంతరంగం-

పరిచయస్తుల గొంతులు- అన్నీ ఏదో లోకంలో నుండి అనుభూతి పొందుతున్నట్లు, వినిపిస్తున్నట్లు శమంతకు అనిపిస్తున్నది. కాని కళ్ళు తెరవలేని అశక్తత. మగత. నీరవ నిశబ్దంలో, ఏ లోకాలకో బంధాలు త్రెంచుకుని వెళ్ళిపోతున్న భావన.

పైలోకాల ఆహ్వాన సూచనతో శమంతకు తన మరణం తెలుస్తున్నది. తన మరణం తర్వాత ఇహలోక అంతిమయాత్ర చేయించటానికి సిద్ధం చేయబోయే వాహనం, 'ఏడుకట్ల' సవారీ శమంత హృదయంలో కదులాడింది. ఆ ప్రక్కనే తన ఊహల పల్లకి మెరుపుల లోకంలో బంగారు పల్లకీలా, దేవతలు తనను తీసుకుని వెళ్ళబోయే దివ్య విమానంలా తళుక్కుమన్నది.



ఊహల్లో- అంతిమ శ్వాసముందు- అంత రంగంలో- అనంత లోకంలో- అంబర వీధిలో కనువిందు చేసే ఆ పల్లకీని మనో నేత్రంతో చూస్తూ పరవశించిపోయింది శమంత. ఆ పరవశం చిరునవ్వులా, ఆరిపోయే ముందు తేజోవంతంగా వెలిగే దీపంలా ఆమె పెదవులపై నిలబడిపోయింది.

పెద్దముత్తయిదువు. నవ్వుతూనే పోయింది. ఏదేవతలు కనిపించారో- అదృష్టవంతురాలు అనుకున్నారందరూ.

★